క్లుప్తంగా

‘ఆశా’లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నల్లగొండ టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆశా కార్యకర్తలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం నల్లగొండలో నిర్వహించిన సీఐటీయూ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు అమలు చేయాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ఆశా కార్యకర్తల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10న జరిగే నిర్వహించనున్న చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో డి.మహేశ్వరి, పెంజర్ల సైదులు, ఆర్.కవిత, జి విమల, టీ.పుష్పలత, కే.శైలు, బి.అనూష, బి రేణుక, ఎండీ అఫీజ, లక్ష్మి, స్వప్న, వెంకటమ్మ, సుజాత, మాధవి, జానకమ్మ, జానకి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



సరుకులు అందజేస్తున్న రామ్మూర్తి

కేతేపల్లి: మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన పల్లె చంద్రమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. కాగా బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం మాజీ కోఆప్షన్ సభ్యుడు చందా రామ్మూర్తి 25 కిలోల బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో చింతా ఆంధ్రయ్య, పల్లె గుర్వయ్య, దండెం జోజి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపు సరికాదు

చండూరు : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో వాటర్ ట్యాంక్ నిర్మాణంలో భాగంగా తవ్విన మట్టిని బయటకు తరలించడం సరికాదని ఏఐఎస్ఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి కురుపాటి పరమేష్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే పాఠశాల ఆవరణ వర్షం వస్తే మునిగిపోతోందని, ఆ మట్టిని పాఠశాల ఆవరణలో పోసి చదును చేయాలన్నారు. మట్టి తరలించేవారిపై మండల స్థాయి అధికారులు చర్యలు కఠిన తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ తల్లి విగ్రహం చరిత్రలో నిలిచిపోతుంది

మర్రిగూడ : హైదరాబాద్‌లోని సచివాలయం ఎదుట కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన తెలంగాణ తల్లి విగ్రహం చరిత్రలో నిలిచిపోతుందని మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య అన్నారు. ఆదివారం మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ మారగోని వెంకటయ్య, ఎలిమినేటి సత్తిరెడ్డి, మేతరి శంకర్, సిరిపంగి వెంకటేష్, మారగోని మల్లేష్, కావలి శేఖర్, పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

పదిహేడేళ్ల కల సాకారమైంది

చిట్యాల: బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు ప్రారంభంతో ఈ ప్రాంత ప్రజల, రైతుల పదిహేడేళ్ల కల సాకరమైందని చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాటం వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాజెక్టు ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటుచేసిన బహిరంగ సభను విజయవంతం చేసిన చిట్యాల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బ్రాహ్మణ వెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టుతో లక్ష ఎకరాలకు పైగా సాగు నీరు అందుతుందన్నారు.

పేదలకు అండగా ఉంటా



నగదు అందజేస్తున్న వట్టికోటి శేఖర్

మునుగోడు: ఆపదలో ఉన్న పేదలకు ఎల్లవేళలా అండగా నిలిచి వారికి సహాయ, సహకారాలు అందజేస్తానని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వట్టికోటి శేఖర్ అన్నారు. మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన నందిపాటి ముత్తయ్య అనే నిరుపేద ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆదివారం బాధిత కుటుంబ సభ్యులను శేఖర్ పరామర్శించి రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. అంతకుముందు ముత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు, ఆ గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు మునుకుంట్ల పరమేష్, నాయకులు కర్నాటి వెంకటేష్, భీమనపల్లి శంకరయ్య, బోయ లక్ష్మణ్, సతీష్, నందిపాటి జనార్దన్ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

చౌటుప్పల్ : గొల్ల, కురుమల సమస్యలను పరిష్కరించాలని జీఎంపీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బండారు నర్సింహా డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

వెలవెలబోతున్న చెరువులు

- ఈ ఏడాది కురవని భారీ వర్షాలు, నిండని చెరువులు
- మత్స్యకారులకు ఉపాధి కరువు
- అన్నదాతలకు కష్టాలు



చుక్క నీరులేక ఎండిపోయిన కొంపల్లి పెద్ద చెరువు

మునుగోడు: ఈ ఏడాది అడపాదడపా వర్షాలు కురిసినా మునుగోడు మండలంలోని ఏ ఒక్క కాల్వ, వాగు పారలేదు. దీంతో చుక్క నీరు రాక చెరువులు వెలవెలబోతున్నాయి. గతంలో ఎప్పుడు వర్షాలు కురిసినా జూలై మొదటివారంలో కనీసం సగం గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీరు వచ్చి చేరేది. కానీ ఈ ఏడాది భారీ వర్షాలు లేకపోవడం.. కేవలం ముసురు వర్షం కురవడంతో చుక్క నీరు కూడా కాల్వల ద్వారా పారలేదు.

మండల వ్యాప్తంగా 112 చెరువులు..

మునుగోడు మండలంలోని 26 గ్రామాల్లో 112 చెరువులు, కుంటలు ఉన్నాయి. అందులో 10 చెరువులు పెద్దవి కాగా 102 చెరువులు చిన్నవి. అయితే గత ఏడాది నిండిన సగానికిపైగా చెరువుల్లో జూలై మాసం వరకు దాదాపు 30 నుంచి 40 శాతం నీరు నిల్వ ఉంది. మిగిలిన కొన్ని చెరువులు, కుంటల్లో ముసురు ద్వారా అదే చెరువుల్లో పారిన నీరు గుంతల్లో నిల్వ ఉంది. ప్రధానంగా పెద్ద చెరువులైన కిష్టాపురం పెద్ద చెరువు, కొరటికల్ జిల్లాయిపేట చెరువుల్లో 40 నుంచి 50 శాతం నీరు నిల్వ ఉంది. మిగిలిన మునుగోడు, సాలిపురం గాంధీసాగర్, చీకటిమామిడి, పులిపలుపుల, కొంపల్లి, పులిపలుపుల, కొరటికల్, కల్వలపల్లి తదితర గ్రామాల్లోని పెద్ద చెరువుల్లో చుక్క నీరు లేదు.

చెరువుల్లో నీరు లేకపోవడంతో..

కుల వృత్తులవారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోంది. అందులో భాగంగా మత్స్యకారులకు ఉపాధి కల్పించేందుకు చెరువుల్లో ఉచితంగా చేప పిల్లల ను వదిలి పెడుతోంది. కానీ ఈ ఏడాది ఆ అవకాశం మండలంలోని మత్స్యకారులకు లేకుండాపోయింది. చేపలు వేసేందుకు సంబంధిత అధికారులు సిద్ధంగా ఉన్నా మండలంలోని చెరువుల్లో చుక్క నీరు లేదు. దీంతో ఈ ఏడాది తమకు ఉపాధి లేకుండా పోయిందని మండలంలోని మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. సగానికి పైగా నీరు ఉన్న కిష్టాపురం చెరువులో మాత్రమే మత్స్యశాఖ అధికారులు ఇటీవల చేప పిల్లలను వదిలినట్లు చెబుతున్నారు.

ఉపాధి కరువైంది



ఈ ఏడాది భారీ వర్షాలు కురవకపోవడంతో చెరువుల్లో నీరు వచ్చి చేరలేదు. దీంతో మాకు ఉపాధి కరువైంది. మా గ్రామంలోని పెద్ద చెరువు ప్రతి ఏటా జూన్ మాసంలోనే నిండేది. కానీ ఈ ఏడాది చుక్క నీరు రాకపోవడంతో ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే చేప పిల్లలు కూడా పొందలేకపోయాం. వర్షం నీరు ద్వారానే చెరువులు నిండడం కష్టంగా ఉంది. పాలకులు ప్రత్యేక దృష్టి సారించి సాగు నీటి కాల్వల ద్వారా చెరువులు నింపితే బాగుండు.

–సూర శంకర్, మత్స్యకార్మికుడు కొంపల్లి

చెరువుల్లో నీరు లేకుండా పోయింది

మునుగోడు మండలంలోని ఏ ఒక్క చెరువులోకి ఈ ఏడాది భారీగా నీరు రాలేదు. గత ఏడాది వచ్చిచేరిన నీరు మాత్రమే పలు గ్రామాల పెద్ద చెరువుల్లో 20 నుంచి 30 శాతం గత ఆగస్టు వరకు నిల్వ ఉంది. భారీ వర్షాలు కురవని కారణంగా ఎక్కడా కాల్వలు, వాగు పారలేదు. దీంతో అనేక చెరువుల్లో నీరు లేకుండా పోయింది. ప్రస్తుతం కిష్టాపురం పెద్ద చెరువు, కొరటికల్ జిల్లాయిపేట చెరువుల్లో మాత్రమే సగం వరకు నీరు నిల్వ ఉంది.

– ప్రేమ్‌కుమార్, ఐబీ, డీఈ

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే లక్ష్యం

- నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్: ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. నకిరేకల్‌లోని పన్నాలగూడెంలో గల క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాన్ని దశాబ్దకాలం పాలించిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలను నిర్లక్ష్యం చేస్తే ఆ ప్రజలే తిరుగుబాటు చేసి ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పారన్నారు. బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు 18 సంవత్సరాల కల అని, ఆ ప్రాజెక్టును నాడు కాంగ్రెస్ హయాంలో దివంగత మహానేత వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేస్తే.. నేడు కాంగ్రెస్ పాలనలోనే సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలనకు సంవత్సరం పూర్తయిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి జిల్లాలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రజాపాలనను ప్రజలు ఆశీర్వదిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి మరోసారి తగిన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మూసీనది ప్రక్షాళనతో కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందని, దీంతో తమ మనుగడ కనుమరుగు జరుగుతుందని భావించి మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటూ బీఆర్ఎస్ రాజకీయ డ్రామా ఆడుతోందన్నారు. మాజీమంత్రి జగదీష్‌రెడ్డి గడిచిన ఐదేళ్లలో బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టుకు ఎంత భూసేకరణ చేశారో, కాలువ నిర్మాణానికి ఎన్ని నిధులు కేటాయించారో వివరించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూసేకరణ చేసి ఉంటే తన పదవిని వదులుకుంటానని, లేకపోతే జగదీశ్‌రెడ్డి పదవిని వదులుకుంటారా అని సవాలు విసిరారు. మోటార్లు ట్రయల్ రన్ చేశామని చెప్పుకుంటున్న జగదీష్‌రెడ్డి.. ప్రాజెక్టులో నీరు ఎందుకు నింపలేదన్నారు. పదేళ్లు మంత్రిగా పనిచేసి ఉమ్మడి జిల్లా ప్రజలను మోసం చేశారు కాబట్టి ప్రజలు బీఆర్ఎస్‌ను ఒక్క సీటుకు పరిమితం చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేధావులతో చర్చించి తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన చేసిందన్నారు.ఈ సమావేశంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్లు, నకిరేకల్ మున్సిపల్ చైర్మన్ చెవుగోని రజితశ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, స్థానిక కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శిబిరం నిర్వహించడం అభినందనీయం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

నల్లగొండ టౌన్: పట్టణంలో ఉచితంగా యునాని మెగా హెల్త్, హిజామా క్యాంపు నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. హైదరాబాద్ నుంచి 25 మంది డాక్టర్లు పరీక్షలు నిర్వహించి సుమారు రూ.5 లక్షల విలువ గల మందులను పంపిణీ చేయడం ప్రశంసనీయమన్నారు. హెల్త్ క్యాంపు ఇన్‌చార్జ్‌లు డాక్టర్ ఎ.ఎ.ఖాన్, నేషనల్ షరీఫ్ ఆధ్వర్యంలో దాదాపు 1200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులు అందజేశారు. స్త్రీలకు మహిళా వైద్యులతో కప్పింగ్ థెరపీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, యోగా గురూజీ రాపోలు వెంకటేశ్వర్లు, సింగం ప్రవీణ్, చొక్కారపు వెంకన్న, కిశోర్, శ్రవణ్, శేఖర్, మహేశ్వరి పాల్గొన్నారు.

చురుగ్గా ‘పోలీస్ స్టేషన్’ పనులు



కొనసాగుతున్న మునుగోడు పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులు

మునుగోడు: ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న మునుగోడు పోలీస్ స్టేషన్ భవన నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. 40 ఏళ్ల క్రితం నిర్మించిన పోలీస్ స్టేషన్ భవనం పూర్తిగా శిథిలమైపోయింది. దాని స్థానంలో నూతన భవన నిర్మాణానికి 2017వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం రూ.72 లక్షల నిధులు మంజూరు చేసి టెండర్ పిలిచింది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి భవన స్లాబ్ నిర్మాణం పూర్తి చేశాడు. ఈ క్రమంలో పోలీస్‌స్టేషన్ ఆవరణ తన పేర పట్టా కలిగిన భూమిలో ఉందని హైదరాబాద్ జేఎన్‌టీయూ కళాశాల మాజీ ప్రిన్సిపాల్ కంచర్ల దశరథ రెడ్డి లోకాయుక్తలో కేసు వేయడంలో పనులు నిలిచిపోయాయి. అయితే ఇటీవల స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చొరవ తీసుకుని దశరథరెడ్డితో మాట్లాడి పోలీస్ స్టేషన్ భవన నిర్మాణానికి ఒప్పించారు. అనంతరం రెండు నెలల క్రితం మిగిలిన పనులకు రూ.32 లక్షలకు టెండర్ పిలిచారు. ఆ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ నెల రోజుల క్రితం పనులు ప్రారంభించాడు.

కస్తూరిబా పాఠశాలకు పరుపులు అందజేత



పరుపులు అందజేస్తున్న కంపెనీ ప్రతినిధులు

కేతేపల్లి : మండలంలోని చెరుకుపల్లి కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలకు ఆదివారం సెంచురీ కంపెనీ ప్రతినిధులు రూ.5లక్షల విలువ చేసే పరుపులు అందజేశారు. చెరుకుపల్లి కేజీబీవీ విద్యార్థులు నేలపై నిద్రిస్తుండడంతో తుంగతుర్తి గ్రామానికి చెందిన మందడి సందీప్‌రెడ్డి(డీఎస్‌పీ) చూసి చలించి, విద్యార్థినుల కష్టాలను సెంచురీ కంపెనీ ప్రతినిధులకు తెలియజేశారు. స్పందించిన ఆ కంపెనీ మేనేజర్ ధనుంజయ్‌మానస సామాజిక సేవ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థినులకు పరుపులు అందజేశారు. ఈ సందర్భంగా ధనుంజయ్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు సేవ చేయడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదిగి సమాజ సేవకు తమ వంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కంపెనీ సీఎండీ పురుషోత్తంమాలాని, జనరల్ మేనేజర్ ఉమేష్, బంటు మహేందర్, మాజీ సర్పంచ్ వల్దాసు లక్ష్మమ్మ, కొండ సరితసైదులు, పోకల సైదులు, కేజీబీవీ ఇన్‌చార్జ్ స్రవంతి, ఏఎన్ఎం జానకమ్మ పాల్గొన్నారు.

కష్టపడితే అనుకున్న లక్ష్యాలు చేరుకోవచ్చు



ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారితో గ్రామ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు

చిట్యాల: యువతీయువకులు ఇష్టంతో కష్టపడి ప్రణాళికబద్ధంగా చదివితే అనుకున్న లక్ష్యాలు చేరుకోవచ్చని చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామ ఎంప్లాయీస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు, హైదరాబాద్ సీటీ టీఎన్‌జీఏ అధ్యక్షుడు గందూరి వెంకటేశ్వర్లు అన్నారు. గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన పదకొండు మంది ఇటీవల ఉపాధ్యాయ, ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొందారు. కాగా ఆదివారం ఆ గ్రామ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగాలు పొందిన వారిని గ్రామంలోని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన వారిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. గ్రామ ఎంప్లాయీస్ అధ్యక్షుడు మారుపాక అంజయ్య, ప్రధాన కార్యదర్శి గరిషె అంజయ్య, కోశాధికారి పంతంగి వెంకటేశం, ఉపాధ్యక్షుడు రెడపాక యాదయ్య, ఎండీ.యూసూఫ్, అన్నెబోయిన రమేష్, మహిళా కార్యదర్శి బుస్సు శంకరమ్మ, సలహాదారులు వీరమళ్ళ శ్రీనివాస్, గోపగోని కృష్ణ, గోపగోని శ్రీనివాస్, మంచాల అంజయ్య, గోలి శ్రీనివాస్, దుబ్బ శివలింగం పాల్గొన్నారు.

కబ్జాదారుల నుంచి ఆశ్రమాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న జగ్జీవన్‌రెడ్డి



నిరసన వ్యక్తం చేస్తున్న భక్తులు

నల్లగొండ టూటౌన్: పట్టణంలోని గంధంవారిగూడెంలో ఉన్న మాణిక్యేశ్వరి మాత ఆశ్రమాన్ని రణదేవ్ మహరాజ్ నుంచి కాపాడాలని మాణిక్యేశ్వరి మాత సెంట్రల్ కమిటీ మెంబర్ జగ్జీవన్‌రెడ్డి కోరారు. ఆదివారం భక్తులతో కలిసి రామగిరి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రణదేవ్ అనే వ్యక్తి మాణిక్యేశ్వరి మాత ఆశ్రమ పీఠాధిపతిని అని ప్రకటించుకుని హైదరాబాద్ నుంచి బౌన్సర్లను, కొంత మంది స్థానికులను తీసుకొచ్చి 30 సంవత్సరాలుగా ఆశ్రమం నిర్వహిస్తున్న గంగాధరచారిని దౌర్జన్యంగా బయటకు వెళ్లగొట్టాడన్నారు. రణదేవ్ తనకు తానే పీఠాధిపతి అని ప్రకటించుకుని ఆశ్రమాన్ని కబ్జా చేశారని ఆరోపించారు. కర్ణాటకలో ఉన్న సెంట్రల్ కమిటీ ఆశ్రమ పీఠాధిపతిని నియమిస్తుందన్నారు. కబ్జాదారుడిపై భక్తులతో కలిసి డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. విచారణ జరిపి భక్తులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వివిధ జిల్లాల్లోని మాతా మాణిక్యేశ్వరి ఆశ్రమాల నిర్వాహకులు, భక్తులు శివరాంరెడ్డి, యాదయ్య, వెంకట్‌రాములు, వీరన్న, వెంకట్‌రెడ్డి, నరేందర్, శంకర్, రామకృష్ణ, నాగిరెడ్డి, వెంకటేష్, ఆంజనేయులు, భీమన్న, హనుమంతు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మేరీమాత ఉత్సవాలు



నిష్కలంకమాత ఆలయం వద్ద భక్తుల సందడి

కట్టంగూర్ : మండలంలోని చిన్నపురి గ్రామంలో ఆదివారం క్రైస్తవులు గ్రామ దేవత మేరీమాత ఉత్సవాలను వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని నిష్కలంకమాత చర్చిని విద్యుత్ లైట్లతో అందంగా అలంకరిచారు. క్రైస్తవులు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ గ్రెగోరీ, కొంక ప్రవీణ్, అలెగ్జాండర్, బాబు శాంసన్, రాయప్ప, మరయ్య, జోసెఫ్, అంథోని, విలియం, జయపాల్, విజయ్, జయంత్, శ్యామ్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

కల్యాణ మండపం ప్రారంభించిన మంత్రి



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ: పట్టణ సమీపంలోని కేశరాజుపల్లిలో వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన పద్మనాయక కల్యాణ మండపాన్ని ఆదివారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మించడం అభినందనీయమన్నారు. అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం సహాయాన్ని అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, వేనేపల్లి చందర్ రావు, మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గోనె మోహన్‌రావు, లక్ష్మణరావు, రామేశ్వరరావు, ఆనంద్‌కుమార్, కేసాని వేణు గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

సకాలంలో అందని ‘108’ సేవలు

- గతంలో సిబ్బందికి వసతి లేదనే సాకుతో అంబులెన్స్ కేటాయించని అధికారులు
- ఇతర మండలాల నుంచి వచ్చేసరికి ప్రాణాలు కోల్పోతున్న క్షతగాత్రులు
- వాహనాన్ని పునరుద్ధరించాలని ప్రజల వేడుకోలు



కేతేపల్లిలో అంబులెన్స్ కోసం ఎదురుచూస్తున్న క్షతగాత్రుడు (ఫైల్)

కేతేపల్లి : ఆపదలో ఉన్న వారికి అత్యవసర వైద్య సేవలందించేందుకు ఆస్పత్రికి తీసుకెళ్లే 108 వాహనం కేతేపల్లి మండలానికి కరువైంది. 108కి డయల్ చేస్తే సకాలంలో వాహనం వచ్చే పరిస్థితి లేక ప్రజల ప్రాణాలు కోల్పోవాల్సి వస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడు ఇతర మండలాల నుంచి 108 వాహనం కేతేపల్లి మండలానికి వచ్చేలోపు క్షతగాత్రులు మృత్యువాత పడుతున్నారు. ఇంతకు ముందున్న 108 సర్వీసును సిబ్బందికి వసతి లేదనే సాకుతో సంబంధిత అధికారులు ఎత్తివేశారు. దీంతో అత్యవసర పరిస్థితుల్లో మారుమూల గ్రామాల నుంచి బాధితులను ఆస్పత్రికి తరలించేందుకు వాహనం లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

వసతి లేదనే కారణంతో..

కేతేపల్లి మండలంలో 13 కిమీమేర 65 నంబరు జాతీయ రహదారి విస్తరించి ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యం బారిన పడిన బాధితులను, పురిటినొప్పులు పడుతున్న గర్భిణులను, జాతీయ రహదారిపై ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందజేసి ఆక్సీజన్‌తో సకాలంలో ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు కాపాడే వీలుంది. మొదట అధికారులు మండలానికి 108 వాహనం కేటాయించారు. సిబ్బందికి గ్రామ పంచాయతీ కార్యాలయంలోని ఒక గదిని కేటాయించారు. ఏడాది గడిచిన అనంతరం సిబ్బంది ఉండేందుకు ఇక్కడ సరైన వసతిలేదనే కారణంతో అధికారులు వాహనాన్ని మరో చోటుకు తరలించారు. ఏళ్లు గడుస్తున్నా మండలానికి తిరిగి 108వాహనం కేటాయించ లేదు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు మండలవాసులు ఎన్నిమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేదు.

ఇతర మండలాల నుంచి రావాల్సిందే..

మండల పరిధిలో 13 కిలోమీటర్ల మేర 65నంబర్ జాతీయ రహదారి విస్తరించి ఉంది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు 108కి ఫోన్ చేస్తే నకిరేకల్, సూర్యాపేట మండలాల నుంచి వాహనం వచ్చే వరకు తీవ్రజాప్యం జరుగుతోంది. ఆయా మండలాల్లో సర్వీసులు బిజీగా ఉంటే జిల్లా కేంద్రం నుంచి రావాల్సి వస్తోంది. ఆయా పట్టణాల నుంచి కేతేపల్లి మండలంలోని పలు గ్రామాలకు వెళ్లాలంటే దాదాపు 30కిమీ ప్రయాణించాల్సి ఉంది. దీంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడానికి సుమారుగా గంటకు పైగా సమయం పడుతోంది. ప్రమాదం జరిగిన తొలి గంట సమయాన్ని గోల్డెన్‌అవర్ అంటారు. ఆ సమయంలో చికిత్స అందిస్తే నిండు ప్రాణాలు కాపాడవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని కేతేపల్లి మండలానికి 108 వాహనం కేటాయించేవిధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

స్థానింగా వాహనం ఉండేలా చూడాలి



అత్యవసర వైద్య చికిత్స కోసం 108 వాహనం పక్క మండలాల నుంచి ఇక్కడకు రావాల్సి వస్తోంది. దీంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కేతేపల్లికి వాహనం కేటాయిస్తే ప్రమాద స్థలం నుంచి ఆస్పత్రికి త్వరగా చేరుకుని ప్రాణాలు కాపాడుకునేందుకు వీలుంటుంది. స్థానికంగా వాహనం అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– టి. నర్సింహచారి, కేతేపల్లి

ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న కంపెనీలు



మాట్లాడుతున్న సత్తయ్య

నల్లగొండ టౌన్ : ఫార్మా కంపెనీలు కార్మికుల హక్కులను కాలరాస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాయని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అన్నారు. తెలంగాణ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ పదో వార్షికోత్సవ సందర్భంగా నల్లగొండలో ఆదివారం సుశ్రుత గ్రామీణ వైద్యుల సంఘం భవనంలో కుటుంబ సభ్యులతో కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దండంపల్లి సత్తయ్య పాల్గొని మాట్లాడుతూ కార్మికులు తమ హక్కులను కాపాడుకునేందుకు కలిసికట్టుగా పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న లేబర్ కోడ్‌లతో కార్మికులకు అన్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భానుకిరణ్, రాజుభట్, తుమ్మల వీరారెడ్డి, హనుమంతరావు, కోట సుధాకర్, సోమ స్వామి, చెరుపల్లి నిరంజన్, రావుల రవికుమార్, పోలా రమేష్, మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ పాల్గొన్నారు.

నిధులు కేటాయించాలి

మిర్యాలగూడ : గిరిజన విద్యాభివృద్ధి కోసం ఏకలవ్య, ఆదర్శ గురుకుల పాఠశాలలతోపాటు, గిరిజన తండాల్లో అభివృద్ధి కోసం ట్రైకార్ ద్వారా ప్రత్యేక నిధులు కేటాయించాలని బంజారా ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ మాలోతు దశరథ్ నాయక్ అన్నారు. ఆదివారం దామరచర్ల మండలం కొండ్రపోల్‌లో కేంద్ర ఏకలవ్య గురుకుల ఆదర్శ పాఠశాలల ఏర్పాటు కమిటీ సభ్యుడు, తెలంగాణ రాష్ట్ర గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ సెక్రటరీ అడావత్ శంకర్‌నాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గిరిజన జనాభా ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో గిరిజనుల అక్షరాస్యత పెంచేందుకు ఆదర్శ ఏకలవ్య పాఠశాలలను ఏర్పాటు చేయాలని, తండాల్లో కనీస సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని కోరారు.